# థాంక్స్ టు ' గ్రాహంబెల్ '

సోమవారం .........

"హలో!"

"ఎవరండీ?"

"పరశురాంగారు కావాలండీ... రచయిత పరశురాంగారు!"

"మాట్లాడుతున్నాను."

"ఓహ్! మీరేనా పరశురాంగారు! నమస్తే, సార్!"

"నమస్తే! మీరెవరు?"

"నా పేరు పారిజాతం సార్! కల్పనా ట్రేడర్స్ నుంచి మాట్లాడుతున్నాను." ఆ గొంతులో కొంచెం కంగారు, మరికొంత ఉత్సాహం ధ్వనిస్తున్నాయి.

"ఏం కావాలి?" అడిగాడు పరశురాం.

"ఏం లేదు సార్! మొన్న వీక్లీ లో వచ్చిన మీ కథ 'మానసవీణ' చదివేను, ఫంటాస్టిక్! చాలా బావుంది."

"థాంక్యూ!"

"మీ కథలంటే నాకు చాలా ఇష్టమండీ! మార్కెట్ లో కొత్తపత్రిక ఏదివచ్చినా అందులో మీ కథ ఉందో, లేదో ముందుగా చూస్తాను. ఉంటేనే కొంటాను."

"అదంతా మీ అభిమానం."

"ఆమధ్య మీరు రాసిన 'విశ్వాసం' కథ కూడా అద్భుతంగా ఉంది సర్! అది చదివినప్పట్నుంచీ మిమ్మల్ని స్వయంగా కలసి అభినందనలు చెప్పాలనుకుంటున్నాను."

"మరి స్వయంగానే రావలసింది! ఫోనెందుకు చేశారు?" అడిగేడు పరశురాం.

"మీరు ఎక్కడుంటారో, ఎలా కలుసుకోవాలో తెలిస్తేగా? మొన్న వీక్లీలో మీ కథ వచ్చిందిగా. ఆ పత్రిక వాళ్ళ దగ్గర బహుశా మీ అడ్రస్ దొరుకుతుందని ఎడిటర్‌గారికి ఫోన్ చేశాను. అదృష్టం బావుండి మీ అడ్రస్‌తో బాటు మీ ఫోన్ నంబరుకూడా చెప్పారు."

"ఐ సీ!"

"సారీ, మిమ్మల్ని డిస్టర్బ్ చేయటం లేదుకదా?"

"నో! నాటెటాల్! ఇట్స్ ప్లెజర్!"

"నాక్కూడా మీతో ఇలా మాట్లాడటం చాలా సంతోషంగా ఉంది. మళ్ళీ మరోసారెప్పుడైనా ఫోన్ చేస్తాను. బై !"

అవతల్నించి ఫోన్ డిస్‌కనెక్ట్ అయిన శబ్దం వినిపించింది పరశురాంకి.

**మంగళవారం..........**

"హలో!"

"కెన్నై స్పీక్ టు మిస్టర్ పరశురాం ప్లీజ్?"

"స్పీకింగ్ ప్లీజ్ !"

"ఓ! మీరేనా? నమస్తే, సార్! నా పేరు ఆంజనేలు. 'అంజీ' అనే పెన్నేమ్‌తో పత్రికల్లో కార్టూన్లు గీస్తుంటాను. చూసేఉంటారు."

"చూసినట్టే జ్ఞాపకం!"

"ఈ వారం పత్రిలో మీ కథ చదివేను సార్! అదే 'మానసవీణ'. సింప్లీ సుపర్బ్! ఇంతకాలంగా మీరు రాసిన కథలన్నీ ఓ ఎత్తూ, ఇదొక్కటీ ఓఎత్తూ అంటే మీరు నమ్మాలి."

"మీ అభిమానానికి థాంక్స్!" స్వరంలో చిరుగర్వం తొణికిసలాడుతుండగా చెప్పాడు పరశురాం.

"నేనో చిన్న కార్టూన్ గీయాలంటేనే తన్నుకు చస్తుంటాను. మరి మీరు కథల్నింత ధారాళంగా ఎలా రాసేస్తారో నాకర్థం కాదు. అసలు నెలకు ఎన్ని కథలు రాస్తారు సార్ మీరు?" ఆసక్తిగా అడిగేడు ఆంజనేలు.

"ఎక్కడండీ? నెలకు రెండో, మూడో.. అంతే!"

"కానీ 'మానసవీణ' లో సుబ్బా పాత్రను చాలా నేచురల్‌గా చిత్రీకరించారు. ఆకథ చదువుతూంటే తాగుడు వల్ల ఎన్ని కుటుంబాలు నాశనమయిపోతున్నాయో కళ్ళకు కట్టినట్టుగా కనిపించింది. తాగుడంటే మీకెంత ద్వేషమో అర్థమైంది."

"నా సంగతలా ఉంచండి. తాగుడువల్ల ఈనాటి యువత ఎంత పతనమై పోతోందో చెప్పాల్సిన బాధ్యత రచయితలకు ఉంటుందని నా నమ్మకం."

"మీ అభిప్రాయంతో నేను పూర్తిగా ఏకీభవిస్తున్నాను. అయితే వ్యక్తిగతంగా మాత్రం నన్ను మీరు మన్నించాలి."

"ఎందుకనీ?" అడిగాడు పరశురాం.

"మరేం లేదు. అప్పుడప్పుడు నాకు మందు కొట్టడం అలవాటు."

"తప్పులేదు లెండి. మనలాంటి వాళ్ళకు కొంచెం మందు పడితేనేగాని మనస్సు మధనపడదు. మనస్సు మధనపడితేనే గానీ ఆలోచనలు రావు. ఆలోచనలు వస్తేనే గదా - మీరు కార్టూన్లు గీసినా, నేను కథలు రాసినా?"

"అంటే...కొంపదీసి మీరు... మీరుకూడా మందు కొడతారా?" అడిగాడు ఆంజనేలు.

"ఏం తప్పా!"

"అహ ! ....... అని కాదు. తాగుడు మంచిది కాదనే భావాన్ని మీ కథలో..."

అతన్ని పూర్తిగా చెప్పనివ్వకుండా పరశురాం అందుకున్నాడు-

"చూడండి, ఆంజనేలుగారూ! రచయితలు చాలామంది మొదట్లో తమ తృప్తికోసం ఒక ఆవేశంతో రాస్తారు. కొంత పేరొచ్చింతర్వాత డబ్బుకోసం రాస్తారు. అలా రాసేటప్పుడు అన్నీ జాతి కథలు కాకపోయినా, జనంకోసం కొన్ని నీతి కథలుకూడా రాయాలి. అంత మాత్రంచేత ఆ నీతిసూత్రాలకు కమిటై ఉండాలంటే ఎలా చెప్పండి?"

"అయితే, మన తొలి పరిచయాన్ని పురస్కరించుకుని మనిద్దరం కాసేపు మాట్లాడుకోవాలి." ఉత్సాహంగా అన్నాడు ఆంజనేలు.

"అలాగే! తెలుగులోనా.. ఇంగ్లీషులోనా?" అడిగాడు పరశురాం.

"అంటే?" ఆంజనేలుకు అర్థం కాలేదు.

"అర్థం కాలేదా? అయితే మీరు 'వాళ్ళిద్దర్తో వీళ్ళు ముగ్గురు' చూళ్ళేదన్నమాట."

"వాళ్ళిద్దర్తో వీళ్ళు ముగ్గురా? ఎప్పుడొచ్చిందదండీ ఆ సినిమా?"

"సినిమాకాదండీ, బాబూ! ఆదివిష్ణుగారి నాటకం. అందులో మందు కొట్టటానికి 'మాట్లాడుకోవడం' అనే ముద్దుపేరును 'కాయిన్' చేశారు రచయిత. వినటానికి పవిత్రంగా వుంటుంది. ఇంగ్లీషులో మాట్లాడు కోవటం అంటే ఫారెన్ సరుకు లాగించటం. తెలుగులో మాట్లాడుకోవటం , అంటే మన బ్రాందీ, విస్కీ ,బీరూ ఇత్యాదుల్ని సేవించటం!"

"అలాగా!." ఆశ్చర్యంగా వింటున్నాడు ఆంజనేలు.

"బూతులు మాట్లాడటం అని ఇంకోటుంది!"

"అంటే?"

"సింపుల్! కల్లూ, సారా పుచ్చుకోవటం!"

"ఛీ! వద్దులెండి. మనం తెలుగువాళ్ళం కనక ఒబ్బిడిగా తెలుగులోనే మాట్లాడు కుందాం.

"ఎప్పుడు?" అడిగాడు పరశురాం.

"రేపూ, ఎల్లుండీ కొంచెం పనుంది. శుక్రవారం కూచుందాం."

"అయ్యో! శుక్రవారం నాక్కొంచెం పనుందే?" ఇబ్బందిగా అనుకున్నాడు పరశురాం.

"అయితే శనివారం."

"బెస్టు! ఆదివారం హాలీడే కనక శనివారమైతే తీరుబడిగా మాట్లాడుకోవచ్చు!"

"మరయితే శెలవా? మళ్ళీ రేపో, ఎల్లుండో ఫోన్ చేస్తాను."

"ఒకే! వెల్‌కం." ఫోన్ హుక్‌మీద పెట్టేశాడు పరశురాం.

**బుధవారం...........**

ఫోన్ గణగణా మ్రోగుతూంటే, రిసీవర్ ఎత్తి 'హలో' అన్నాడు పరశురాం.

"హలో...పరశురాం గారేనా?' అవతలి గొంతు ప్రశ్నించింది.

"అవునండీ, మీరెవరూ?"

"గుర్తు పట్టలేదా?"

గుర్తు పట్టడానికి ప్రయత్నిస్తున్నాడు పరశురాం.

"అవున్లెండి. పేరు ప్రఖ్యాతులున్న రచయితలు మీరు. మీకు ఎందరో అభిమానులుంటారు. తెల్లారి లేస్తే ఎంతోమంది మీకు ఫోన్ చేస్తూంటారు." నిష్ఠూరంగా అన్న దామె.

"ఆ! గుర్తొచ్చారు. మీరు పారిజాతంగారు... అవునా?" ఉత్సాహంగా అడిగాడు.

"థాంక్ గాడ్! నేను జ్ఞాపకం ఉన్నానంటే అదృష్టవంతురాల్నే!"

"రచయితలకు జ్ఞాపకశక్తి ఎక్కువుంటుంది."

"అవునూ...ఇప్పుడేం రాస్తున్నారు?" అడిగిందామె.

"మా చాకలి వస్తేనూ..ఇపుడే అతనికి బట్టలు వేసి పద్దు రాస్తున్నాను. ఇంతలోనే మీ ఫోను!" జోక్‌చేశాడు.

"అదికాదండీ, బాబూ! మళ్ళీ కథ లేమన్నా రాస్తున్నారా అని?"

"రాయాలండీ! మెదడులో ఎన్నో ఆలోచనలు గజిబిజిగా తిరుగుతున్నాయి. ఏం రాయాలా అని ఆలోచిస్తున్నాను."

"రోజూ నేను ఆఫీసుకి వస్తూంటే, కొంత మంది పోకిరీ కుర్రాళ్ళు వెనకబడి అల్లరి చేస్తుంటారు. అందమైన ఆడపిల్ల ఒంటరిగా కనిపిస్తే ఆట పట్టించాలని చూసే ఇలాంటి ఆకతాయి కుర్రాళ్ళకు గుణపాఠం చెప్పేలా ఓ మంచికథ రాయకూడదూ?" సలహా ఇచ్చింది పారిజాతం.

"ష్యూర్! మీరు ఇన్స్పిరేషన్ ఇవ్వాలేగానీ కథేమిటీ......నవలే రాసేయగలను!" గర్వంగా చెప్పాడు.

వెంటనే పారిజాతం బదులు చెప్పలేదు.

"మీరేం అనుకోపోతే రేపు సాయంత్రం ఉడ్‌లాండ్స్ హోటల్‌కి రాకూడదూ?" అడిగాడు పరశురాం, కొన్ని క్షణాల తర్వాత.

"ఏమిటీ విశేషం?"

"మరేంలేదు! ఇంట్లో ఉంటే కుదరటం లేదని ఆ హోటల్లో రూమ్ తీసుకుని నవల రాస్తున్నాను. రేపు మీరొస్తే కాసేపు కూర్చుని మాట్లాడుకోవచ్చు!"

"అమ్మో! పెళ్ళికాని ఓ ఆడపిల్ల అలా హోటల్స్‌కి వస్తే ఇంకేమన్నా ఉందా?"

"చదువుకుని ఉద్యోగం చేస్తున్నా, మీ భావాలు మాత్రం ఇంకా పాత రాతియుగంలోనే ప్రయాణం చేస్తున్నాయి!"

"అంటే? మీ ఉద్దేశం చదువుకుని ఉద్యోగం చేసే అమ్మాయిలంతా ముక్కూ మొహం తెలియని మగవాళ్ళతో హోటల్స్‌కీ , క్లబ్బులకీ తిరగాలనా?"

"తిరగాలని కాదుగానీ...తిరిగితే తప్పులేదని చెప్పగలను. ఇవాళ సొసైటీ చాలా మారిపోయింది పారిజాతంగారూ! ఆడవాళ్ళూ, మగవాళ్ళూ కూడా ఫాస్ట్ లైఫ్ కోరుకుంటున్నారు.. రచనల్లో ఓ రకమైన థ్రిల్లు కావాలని ఆశిస్తున్నట్టే, జీవితంలో కూడా థ్రిల్ కావాలనుకుంటున్నారు. అయినా, నన్ను ముక్కూ మొహం తెలియని వాడిగా మీరు భావిస్తున్నారేమో! నేను మాత్రం అలా అనుకోవటం లేదు. మీరు మొన్న తొలిసారిగా నాతో ఫోన్లో మాట్లాడినప్పుడే మీరంటే అదోరకమైన అభిమానం ఏర్పడింది. అందుకే మీతో కాసేపు స్వయంగా మాట్లాడాలనీ...' అని ఇంకా ఏదో చెప్పబోతుండగా పారిజాతం అతన్ని వారించింది.

"సారీ సార్! మీ సహృదయతను అర్థం చేసుకోలేక పోయాను. మరోసారి కలుద్దాం." అంటూ ఫోన్ పెట్టేసింది.

గురువారం.........

"హలో!"

"నమస్తే. గురువుగారూ, ఆంజనేయుల్ని!"

"మీరా! నమస్తే. బావున్నారా? ఏమిటి విశేషాలు?"

"విశేషాలేం లేవుసార్! శనివారం తీరుబడిగా మాట్లాడుకుందాం అన్నారుగా! ఎల్లుండే శనివారం....... గుర్తుచేద్దామని."

"ఓకే! ఎక్కడ కూచుందాం?" అడిగేడు పరశురాం.

"డిప్లొమేట్ బార్‌లో పుడ్డు బావుంటుంది!" చెప్పాడు ఆంజనేలు.

"పుడ్డు బావున్నా- మందు కల్తీ సార్, అక్కడ!"

"పోనీ హనీమూన్ బార్ కి వెడదాం!"

"అమ్మో! అక్కడ ఒకటే గోల......సుఖంగా మాట్లాడుకోలేం!"

"ఊర్లో బార్లన్నీ మీకు పరిచయమే అనుకుంటాను. మీరే చెప్పండి ఎక్కడికి పోదామంటారు?" అడిగాడు ఆంజనేలు

"త్రిబుల్ స్టార్‌కి పోదాం! అక్కడైతే కేబరే కూడా ఉంటుంది."

"ఓకే! ఎల్లుండి సాయంత్రం సరిగ్గా ఆరయ్యేసరికి మీరు అక్కడ ఉండాలి"

"ష్యూర్! కానీ మిమ్మల్ని గుర్తు పట్టడం ఎలాగా అని?" తన సందేహాన్ని వ్యక్తం చేశాడు పరశురాం.

"డోన్ట్ వర్రీ, గురువుగారూ! నేను మిమ్మల్ని గుర్తు పట్టగలన్లెండి!"

"ఎలా?"

"చెప్తానుగా!"

ఫోన్ డిస్‌కనెక్ట్ అయిపోయింది.

శుక్రవారం........

రాఘవయ్య ఇంటిముందు కారాగింది. వెంకట్రావుగారు భార్యా పుత్ర సమేతంగా కారు దిగేరు.

వాళ్ళ ముగ్గుర్నీ చిరునవ్వుతో లోపలకు ఆహ్వానించి సోఫాలు చూపించాడు రాఘవయ్య. పరిచయాలన్నీ పూర్తయిం తర్వాత--

"పెళ్ళికూతుర్ని  తీసుకురండీ!" అన్నాడు వెంకట్రావు.

రాఘవయ్య భార్య మాణిక్యాంబ, సుజాతను తీసుకొచ్చి పెళ్ళికొడుకు హోదాలో వచ్చిన పరశురాంకి ఎదురుగా ఉన్న కుర్చీలో కూర్చోపెట్టింది.

"ఏం చదువుకున్నావమ్మా?"  సుజాతను పరిశీలనగా చూస్తూ పరశురాం తల్లి పార్వతమ్మ ప్రశ్నించింది.

"బి.ఎ."

అంతలోనే అక్కడికి వచ్చి, సుజాత పక్కనే ఉన్న మరో కుర్చీలో కూర్చుంటున్న యువకుణ్ణి పెళ్ళివారికి పరిచయం చేశాడు రాఘవయ్య.

"వీడు మావేనల్లుడు, పేరు రాజశేఖరం. జంషెడ్‌పూర్‌లో ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు."

"అంటే.... పెళ్ళికూతురి అన్నగారా?"  అడిగింది పార్వతమ్మ.

"అవునండీ. పెళ్ళిచూపులు ఈ ఊళ్ళోనే ఏర్పాటు చేస్తున్నామనీ, ఏలురునుంచి మా చెల్లాయి  ఇక్కడికి వస్తోందనీ ఆ మధ్య  మామయ్య ఉత్తరం రాశారు. అందుకే నాలుగు రోజులు శెలవుపెట్టి వచ్చాను." రాజశేఖరమే చెప్పాడు.

అంతలో టిఫినూ, కాఫీ వచ్చాయి.

"వీళ్ళకి ఏలూర్లో సొంత ఇల్లు ఉందన్నారు కదూ?" టిఫిన్ తింటూ అడిగింది పార్వతమ్మ.

"అవునక్కయ్యగారూ! ఎంతలేదన్నా లక్ష రూపాయల విలువ చేస్తుంది. అందులో రెండు వాటాలు అద్దె కిచ్చి, మరో చిన్నవాటాలో మా ఆడపడుచు ఉంటోంది. ఆవిడ భర్తపోయి ఎనిమిదేళ్ళు పైన అయ్యుంటుంది. అప్పట్నుంచీ ఆ కుటుంబం బరువు బాధ్యతలన్నీ మావారే చూసుకుంటున్నారు. సుజాతకి సంబంధం సెటిలయితే, ఇతనికి మా అమ్మాయినిచ్చి రెండు పెళ్ళిళ్ళూ ఒకేసారి చేద్దామనుకుంటున్నాం!" వివరంగా చెప్పింది మాణిక్యాంబ.

ఈలోగా టిఫిన్‌తింటున్న తల్లితో రహస్యంగా ఏదో చెప్పాడు పరశురాం. ఆ వెంటనే కొడుకు చెప్పిన  విషయాన్ని  భర్త చెవిలో చెప్పేసింది పార్వతమ్మ.

పెళ్ళిచూపుల తంతు అక్కడితో పూర్తయింది.

"మా అబ్బాయికి పిల్ల నచ్చిందని ఇంతకుముందే చెప్పాడు.కాబట్టి, మీరు మంచిరోజు చూసుకుని మా ఇంటికి వస్తే తక్కిన విషయాలన్నీ మాట్లాడుకోవచ్చు."  కారెక్కి కూర్చున్న

తర్వాత, తమను సాగనంపటానికి వచ్చిన రాఘవయ్యతో చెప్పాడు వెంకట్రావు.

శనివారం......

ట్రిబుల్ స్టార్ బార్‌లో ఒకమూల ఏకాంతంగా కూర్చుని, ఆంజనేలు రాకకోసం ఎదురు చూస్తున్న పరశురాం దగ్గరకు హడావిడిగా వచ్చాడు రాజశేఖరం.

"హలో!" షేక్‌హాండ్‌కోసం చేయి చాపాడు.

అతన్ని చూసిన పరశురాం ముఖం క్షణం సేపు పాలిపోయినట్టు అయింది. నోట మాటలేకుండానే అప్రయత్నంగా చేయి కలిపాడు.

"మీరు....మీరు డ్రింక్ చేస్తారా?" పరశురాం మాటలు కూడా తడబడ్డాయి.

చిన్నగా నవ్వుకున్నాడు రాజశేఖరం.

"లేదండీ! నా కలవాటు లేదు. నేనొచ్చింది మీ కోసం." చెప్పాడు

"అంటే!?" అర్థం కాలేదు పరశురాంకి.

"మరేం లేదు. ఫోన్లో మీతో మాట్లాడిన ఆంజనేయుల్ని నేనే!"

షాకయ్యాడు పరశురాం.

"ఉడ్‌లాండ్స్ హోటల్‌కి మీరు రమ్మని ఫోన్లో ఆహ్వానించిన పారిజాతం ఎవరో కాదు. మా మామయ్యగారి అమ్మాయి.....ఐ మీన్...నాకు కాబోయే భార్య."

తల తిరుగుతున్నట్లవుతూంటే రాజశేఖరంవైపు అయోమయంగా చూస్తూండి పోయాడు పరశురాం.

"క్షమించాలి పరశురాంగారూ! నా చెల్లెలికి కాబోయే భర్తకి ఎలాంటి చెడుఅలవాట్లూ ఉండకూడదనీ, అతని సాన్నిహిత్యంలో నా చెల్లెలు సుఖపడాలనే తాపత్రయంలో - మీ గురించి తెలుసుకోటానికి ఫోన్లో ఇలా మీతో పరిచయం చేసుకోవాల్సి వచ్చింది!" తప్పుచేసిన వాడిలా తల దించుకున్నాడు రాజశేఖరం.

కోపంతో పరశురాం కళ్ళు ఎర్రబడ్డాయి.

"అనవసరంగా మీరు శ్రమ తీసుకున్నారు. మీకు తాగుడు అలవాటుందా? అని డైరక్టుగా అడిగి ఉంటే చెప్పేవాణ్ణి!" అన్నాడు.

"అఫ్‌కోర్స్! మీలో ఆ సంస్కారం ఉండొచ్చు. కానీ, మా సుజాత మనసేమిటో తెలిసినవాణ్ణి కనక నేనే శ్రమ తీసుకోవాల్సి వచ్చింది. మీకు తెలీదు, పరశురాంగారూ! మా నాన్న గారికి తాగుడు అలవాటుండేది. ప్రతిరోజూ ఆయన తాగేవారు. చివరికి ఆ తాగుడే

ఆయన ప్రాణాలు తాగేసింది. తాగొచ్చినపుడు ఆయన ప్రవర్తన చూసి నేనూ, సుజాతా సిగ్గుపడే వాళ్ళం, బాధపడే వాళ్ళం. మా అమ్మ ఒకొక్కసారి ఆయన చేతిలో దెబ్బలు కూడా తినేది. అందువల్లనే మా సుజాతకి తాగుడన్నా, తాగే వాళ్లన్నా అసహ్యం!" రాజశేఖరం చెప్తూంటే శ్రద్ధగా వింటున్నాడు పరశురాం.

క్షణం ఆగి మళ్ళీ చెప్పసాగేడు రాజశేఖరం.—

"ప్రతి మగవాడూ తనకు భార్యగా వచ్చే స్త్రీ అందమైనది కావాలనీ, గుణవంతురాలు కావాలనీ, సీతా, సావిత్రీ, అనసూయలా మహాపతివ్రత అయ్యుండాలనీ కోరుకుంటాడు. నన్నడిగితే కారక్టర్ ఆడదానికే కాదు - మగవాడిక్కూడా కావాలంటాను. ప్రతి స్త్రీ తన భర్త శ్రీరామచంద్రుడంతటి ఉత్తముడు కావాలనుకుంటుంది. అందుకే నేనూ, పారిజతం కలసి మీ అలవాట్లేమిటో తెలుసుకోవాలనుకున్నాం. లక్కీగా మీ ఇంట్లో టెలీఫోన్ ఉండటంవల్ల ఇలాంటి అవకాశం దొరికింది." చెప్పటం ముగించి పరశురాంవైపు చూశాడు.

కానీ అతను బదులు చెప్పలేదు. అతని చూపుల్లో కోపంకూడా తగ్గలేదు.

"మీకింకా కోపం తగ్గినట్టు లేదు. నా చెల్లెలు సుఖపడాలనే తాపత్రయంతో అనండి, స్వార్థంతో అనండి...... ఇలా ప్రవర్తించవలసి వచ్చింది. అంతమాత్రం చేత మిమ్మల్ని కించపరచినట్లు భావిస్తే నేను భరించలేను. సొసైటీలో మీకున్న పేరు ప్రఖ్యాతుల ముందు ఈ చిరు అలవాటు చెడు అలవాటు కాకపోవచ్చు. కాబట్టి జరిగింది మరిచిపోయి నన్ను మీ ఫ్రెండుగా భావించి, మీరు తెలుగులో మాట్లాడితే, నేను మౌనంగా వింటూ కూర్చుంటాను" అన్నాడు రాజశేఖరం చిరునవ్వుతో.

పరశురాం బేరర్ని పిలిచాడు..

**ఆదివారం........**

"మొత్తానికి గ్రహంబెల్ మహాశయుడు టెలిఫోన్ కనిపెట్టి మనకు ఓరకంగా మేలే చేశాడు" అంది సుజాత రాజశేఖరంతో.

"సుజాతకు మళ్ళీ సంబంధం వెతకాలన్న మాట." అనుకున్నాడు రాఘవయ్య మనసులోనే.

★

(ఆంధ్రప్రభ - 13-6-84)